క్లుప్తంగా

బావిలో పడి వివాహిత మృతి

సిరిసిల్లఅర్బన్: వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్తుండగా కాలుజారి బావిలో పడి వివాహిత మృతిచెందిన సంఘటన సిరిసిల్ల పరిధిలోని ముష్టిపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముష్టిపల్లికి చెందిన చీమల సంతోషి(30) వ్యవసాయ పనులు చేసేందుకు గురువారం తమ పొలం వద్దకు వెళ్లింది. పొలానికి నీళ్లు పెట్టడానికి బావి పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి అందులో పడి మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మహేశ్ మూడు నెలల కోసం దుబాయ్ వెళ్లాడు. కుమార్తె కృతిక(9), కుమారుడు విహాంత్(7) ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పరిధిలోని చంద్రంపేట చౌరస్తా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కంప్రెషర్ పట్టివేత

ముస్తాబాద్: ముస్తాబాద్ శివారులో కంప్రెషర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కంప్రెషర్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఠాణాకు తరలించి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని 9, 10వతరగతి దివ్యాంగ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్ తోపాటు పోస్టుమెట్రిక్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. WWW.SCHOLORSHIPS.GOV.IN, WWW.DEPWD.GOV.IN వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు, పోస్టుమెట్రిక్, టాప్‌క్లాసు ఎడ్యుకేషనల్ ఉపకార వేతనాలకు అక్టోబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం కలెక్టరేట్‌లోని సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఎల్‌వోసీ మంజూరు

వేములవాడ: కమ్మరివాడకు చెందిన సంజీవ్ అనారోగ్య సమస్యతో అత్యవసర చికిత్స కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సంప్రదించారు. నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

గంభీరావుపేట: విభజించి పాలించాలనే బీజేపీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు చంద్రం అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి గంభీరావుపేట మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. బాలయ్య, శంకర్, సుదర్శన్, రమేశ్, అనంతరాములు, యాదగిరి తదితరులున్నారు.

వీర్నపల్లి: మండల మాల సంఘం నాయకులు, సభ్యులు గురువారం కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరారు. ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాల సంఘం నాయకులు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్‌గా సంతోష్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు జిల్లా కన్వీనర్‌గా ముస్తాబాద్‌కు చెందిన మల్లారపు సంతోష్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ ఒకటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదును గ్రామగ్రామాన చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతను సంతోష్‌రెడ్డికి అప్పగించామన్నారు. కోకన్వీనర్లుగా సిరికొండ శ్రీనివాస్, మిర్యాల్‌కార్ బాలాజీ, బర్కం లక్ష్మినవీన్‌యాదవ్‌ను నియమించారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

రుద్రంగి: పీఆర్‌టీయూ టీఎస్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల శాఖ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ఘనంగా నిర్వహించారు. ఎడ్ల కిషన్ మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్ర శాఖ ఏకీకృత సర్వీసులను సాధించి అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఈవో, డిప్యూటీ ఎంఈవో ప్రమోషన్లు ఇప్పించనుందని అన్నారు. జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, చందుర్తి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు రమణారెడ్డి, అసోషియేట్ అధ్యక్షుడు లింగయ్య, ఉపాధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి

ఇల్లంతకుంట: కందికట్కూరులో ఆదివారం అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేశ్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్, విప్ ఆది శ్రీనివాస్ తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని, మండల ప్రజలు హాజరు కావాలని కోరారు.

శ్రీనగర్‌కాలనీ.. సమస్యల ఒరవడి

సిరిసిల్ల శివారులోని కొత్తచెరువు నీటిని మంగళవారం రాత్రి నుంచి విడుదల చేయడంతో కిందనున్న శ్రీనగర్‌కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వరదనీరు శ్రీనగర్ కాలనీని ముంచెత్తింది. పలు ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరింది. అంతేకాకుండా శ్రీనగర్‌కాలనీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయి. పందులు కాలనీల్లో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారులు కనీసం ఇటువైపు చూడడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల


శ్రీనగర్‌కాలనీలో ఇళ్ల చుట్టూ నిలిచిన వర్షపు నీరు


తిరుగుతున్న పందులు


ముంచెత్తిన చెరువు నీరు

సిరిసిల్ల: పట్టణంలోని శాంతినగర్‌లో మట్టి రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. నివాస ప్రాంతాలకు వెళ్లి రావడం కష్టంగా ఉంది. మున్సిపల్ అధికారులు, స్థానిక కౌన్సిలర్‌కు చెప్పినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు చూస్తే పట్టణం కంటే పల్లెలు నయమనిపిస్తోంది. అక్కడ కనీసం సిమెంట్ రోడ్లు వేస్తారు. శాంతినగర్‌లో పలు కాలనీల్లో మట్టి రోడ్లే దిక్కవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కనీసం వర్షాకాలంలో మట్టి రోడ్లపై మొరమైనా పోస్తే రాకపోకలకు వీలవుతుంది.

– పూధారి అంజి, శాంతినగర్, సిరిసిల్ల



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసత్ అలీబేగ్ సెల్ నంబర్: 9849905879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048

అవస్థల సంత



ముస్తాబాద్ వారసంత అవస్థల నిలయంగా మారింది. స్థానిక తెలంగాణచౌక్‌లో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంతతో ట్రాఫిక్ గందరగోళంగా మారుతుంది. సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారిపై దుబ్బాకకు వెళ్లే కూడలిలో ఈ వారసంత నిర్వహిస్తున్నారు. రోడ్డు డివైడర్‌కు ఒక వైపుగా నిర్వహిస్తున్న వారసంతలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రతీ వారం ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్‌శాఖ ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా ఒక్కరిని కూడా ఇక్కడ విధుల్లో ఉంచడం లేదు. ఫలితంగా ప్రతీ ఆదివారం ట్రాఫిక్ జామ్ అవుతుంది. ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తే సంత సాఫీగా సాగే అవకాశం ఉంది.

– ముస్తాబాద్

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

వేములవాడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కోటలు కడుతోందని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వేములవాడ: తెలంగాణచౌక్‌లో మాట్లాడుతున్న లక్ష్మినర్సింహారావు, పాల్గొన్న తుల ఉమ, న్యాలకొండ అరుణ, తీగల రవీందర్‌గౌడ్, నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మానేరు వంతెనపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడారు. గజభీంకార్ రాజన్న, పడిగెల మానస, కోడి అంతయ్య, మాట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: తెలంగాణచౌక్‌లో బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. మాజీ ఎంపీపీలు జనగామ శరత్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, విజయరామారావు, కొమ్ము బాలయ్య, మల్లేశ్, సుమతి, లక్ష్మణ్, సతీశ్ చందర్, స్వామి, మనోహర్, నందు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: బీఆర్‌ఎస్ నాయకులు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ భూపతికి వినతిపత్రం అందించారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, వెంకటియాదవ్, సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు, మాజీ ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ కొమిరిశెట్టి లక్ష్మణ్, మానేరు నీటి సంఘాల మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు రాజారాం, గంధ్యాడపు రాజు, గడ్డి హరీశ్, రాజేందర్, రాజు, సంజీవ్, రాజేందర్, హన్మండ్లు, ఎర్ర ఎల్లాగౌడ్, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకుడు రవి బోయిని, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, సింగిల్‌విండో చైర్మన్లు గుండారపు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు అందె సుభాష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాబహదూర్ వెంకటరామిరెడ్డికి నివాళి

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో గురువారం కొత్వాల్ రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి, సిరిసిల్ల సింగిల్విండో వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు ఎడమల హనుమంతరెడ్డి, ఆసాని సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో త్వరలో రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రేపా కన్వీనర్ మోతె దేవారెడ్డి, కోకన్వీనర్ ముత్యాల వెంకటరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, యమగొండ బాల్‌రెడ్డి తెలిపారు.


తంగళ్లపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు చట్టాలు తెలియాలి

సిరిసిల్లటౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైశ్వాల్ పేర్కొన్నారు. గురువారం చిన్నబోనాల గురుకుల కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు వాడకంతో విద్యార్థులకు కలిగే అనర్థాలు వివరించారు. ఏజీపీ కీసరి శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్ ఆడెపు వేణు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అటవీ భూమి అన్యాక్రాంతం

కోనరావుపేట: అటవీ భూమి అన్యాక్రాంతమవుతుంది. అటవీ భూమి ఆక్రమణను అడ్డుకోవాల్సిన అధికారులు జేసీబీ పెట్టి చదును చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి శివారులోని కుమ్మరిగుట్టపై కొందరు వ్యక్తులు అటవీశాఖ భూమిని చదును చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అటవీ అధికారులకు, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికే 10 ఎకరాల వరకు చదును చేశారని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు తనిఖీ

తంగళ్లపల్లి: మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. ఇసుక కోసం తీసుకున్న అనుమతి పత్రాలను పరిశీలించారు.

పుస్తెమెట్టెలు అందజేత

గంభీరావుపేట: నాగంపేటకు చెందిన నిరుపేద కుటుంబం గంగనోళ్ల రవికుమార్–శోభ దంపతుల కూతురు ప్రియాంక వివాహానికి ఎల్లారెడ్డిపేటకు చెందిన నేవూరి వెంకట్‌రెడ్డి పుస్తెమెట్టెలు సమకూర్చారు. గురువారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండల అధ్యక్షుడు హమీద్, గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, మాజీ సర్పంచ్ భూమరాజం అందించారు.

మాజీ ప్రజాప్రతినిధి భర్తపై చర్యలు తీసుకోవాలి

రుద్రంగి: రైతు రుణమాఫీపై రుద్రంగిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య సోషల్ మీడియాలో మొదలైన పోరు పోలీస్ స్టేషన్‌కు చేరింది. గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేములవాడలో జరిగిన రైతు రుణమాఫీ ధర్నాలో రుద్రంగికి చెందిన ఓ మండల స్థాయి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధి పాల్గొన్నారు. ఆమెకు రూ.2లక్షల రుణమాఫీ అయ్యింది. ధర్నా చేస్తున్న రుద్రంగి మాజీ ప్రజాప్రతినిధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందంటూ స్థానిక వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ నాయకులు పోస్టు చేశారు. దీనిపై స్పందించిన సదరు మాజీ ప్రజాప్రతినిధి భర్త అసభ్య పదజాలంతో వాయిస్ మెసెజ్ పెట్టాడు. ఇది కాస్త కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ చేసుకునే దాకా వెళ్లింది. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్దకు కాంగ్రెస్ నాయకులు చర్చకు రాగా.. సదరు మాజీ ప్రజాప్రతినిధి భర్త ముఖం చాటేసినట్లు తెలిసింది. రుద్రంగి ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులను తిడుతూ వాట్సప్ గ్రూపులో మెసెజులు పోస్టు చేసిన రుద్రంగి మాజీ ప్రజాప్రతినిధి భర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు పర్యవేక్షకుల బదిలీ

వేములవాడ: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఇద్దరు పర్యవేక్షకులకు మరోసారి బదిలీ జరిగింది. రాజన్న ఆలయంలో పర్యవేక్షకులుగా పనిచేసిన గోలి శ్రీనివాస్ యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. ఈక్రమంలోనే యాదగిరిగుట్టలో పనిచేసే పర్యవేక్షకులు రాజన్‌బాబుకు వేములవాడ ఆలయానికి బదిలీ అయ్యింది. ఆమేరకు విధుల్లో చేరారు. ఇందులో గోలి శ్రీనివాస్ ప్రభుత్వ విప్ పీఎస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన లేఖ రాయడంతో గోలి శ్రీనివాస్‌ను వేములవాడ ఆలయానికి, వేములవాడలో పనిచేస్తున్న రాజన్‌బాబును యాదగిరిగుట్టకు డిప్యూటేషన్‌పై తిరిగి బదిలీ చేశారు. యాదగిరిగుట్టలో పర్యవేక్షకుల కొరత ఉండడంతో అక్కడి ఈవో అభ్యర్థన మేరకు రాజన్‌బాబును తిరిగి అక్కడికి తీసుకున్నట్లు ఆలయ ఉద్యోగులు తెలిపారు.

చెయ్యిచెయ్యి కలిపారు.. గుంత పూడ్చారు

వేములవాడ: పట్టణంలోని 10వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం ముందు డ్రైనేజీ గొయ్యి పడి ఉండటాన్ని గమనించిన కాలనీ యువకులు కౌన్సిలర్ సిరిగిరి రామచంద్రం సహకారంతో మరమ్మతు చేశారు. బొల్లం దేవరాజు, మల్యాల సుమన్, సామల బబ్లు సిమెంట్ తీసుకొచ్చి ప్రమాదకర గొయ్యిని గురువారం పూడ్చారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలు, తల్లులు ప్రమాదం బారిన పడొద్దని పూడ్చినట్లు యువకులు చెప్పారు.

రైతులకు అవగాహన

బోయినపల్లి(చొప్పదండి): తడగొండ గ్రామంలో వయ్యారిభామ కలుపు నివారణపై ఏరువాక కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ కె.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు.

లక్ష్మీగణపతి హోమం

ఇల్లంతకుంట: సంకష్టహర చతుర్థి సందర్భంగా మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రం, జంగారెడ్డిపల్లె రామలింగేశ్వర ఆలయంలో లక్ష్మీగణపతి హోమం గురువారం పురోహితులు నిర్వహించారు. గంగాధర క్షేత్రంలో మూల విరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం చేయించినట్లు పురోహితుడు రాజు తెలిపారు. జంగారెడ్డిపల్లె రామలింగేశ్వర ఆలయంలో గణపతి పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. లింగమూర్తి, విటల్‌శర్మ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటినట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులకు పార్టిసిపేషన్ ప్రశంసాపత్రాలు గురువారం అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌రెడ్డి తెలిపారు. లహరి ఆరాధ్య గ్రూపు విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గంభీరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వైద్యాధికారులు గురువారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సీహెచ్‌వో రమేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

పరిమితికి మించి వద్దు



బోయినపల్లి: ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశముంది. గతంలో కొండగట్టు రోడ్డు ప్రమాదంలో ఎంతోమంది మృతిచెందారు. ఇటీవల జగిత్యాల పరిసరాల్లో ప్రయాణికుల రద్దీతో వెళ్తున్న ఓ బస్సు చక్రాలు ఊడిపోయాయి. ఇలా అనేక సంఘటనలు జరుగుతున్నాయి. మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యంతో రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచాలి. ప్రమాదాలు నివారించాలి.

– గుడి రవీందర్‌రెడ్డి, తడగొండ, బోయినపల్లి

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా గురువారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	20	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	03	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	05	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	23	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	31	448
పార్వతీపురం స్పెషల్	10	672
పార్వతీపురం సాధారణ	11	336

- వేములవాడ

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సిరిసిల్ల అర్బన్: రైతులందరికీ రుణమాఫీ చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌కు బోయినిపల్లి మండలం మల్కాపూర్ రైతులు గురువారం వినతిపత్రం అందించారు. మంద కొమురయ్య, పబ్బాల బక్కయ్య, ఎడపల్లి పర్శరాములు, పబ్బాల భూమయ్య, కనకయ్య, మహేందర్, శంకరయ్య, ప్రభాకర్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి

సాక్షి స్పందన

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో గంజి వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన నత్తనడకన వంతెన పనులు కథనానికి కలెక్టర్ స్పందించారు. గురువారం బ్రిడ్జి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పనులు ఎక్కడి వరకు పూర్తి చేశారు.. ఏం పనులు చేయాల్సి ఉంది తదితర విషయాలు అధికారులనడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈవో వినోద్, ఎంపీడీవో బీమా జయశీల, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, సంబ లక్ష్మిరాజం, ఉపేందర్, ఎల్లేశ్ తదితరులున్నారు.


బ్రిడ్జి వద్ద ఎంపీడీవోతో మాట్లాడుతున్న కలెక్టర్

అధిక లోడ్‌తో ఇబ్బందులు

కోనరావుపేట: కనగర్తిలో ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో కొన్ని నెలలుగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సెస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి సంఘం సమీపంలో విద్యుత్ స్తంభానికి సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం వేళలో అధిక లోడ్‌తో బ్రేకర్ పడిపోతోంది. దీంతో ఆ ప్రాంతంలోని ఇళ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ 15 కేవీఏ ఉండడంతో సమస్య ఏర్పడుతోందని, ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని పెంచాలని కొన్ని నెలలుగా సెస్ అధికారులను కోరుతున్నా వారు స్పందించడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై సెస్ ఏఈ దివ్యను వివరణ కోరగా.. ఇప్పటివరకు సమస్య తన దృష్టికి రాలేదని, సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు.


కనగర్తిలో ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

సిరిసిల్ల ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

సిరిసిల్లటౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కార్యక్రమం జరిగింది. సిరిసిల్లకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ గుజ్జె నవీన్‌కుమార్ పాల్గొనగా.. బెస్ట్ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికయ్యారు. జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నరేశ్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నవీన్‌ను సిరిసిల్ల జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు అభినందించారు.


నిజామాబాద్‌లో అవార్డు అందుకుంటున్న నవీన్